**200వ అధ్యాయం**

# ٢٠٠ - بَابُ سُنَّةِ الْعَصْرِ

# అస్ర్‌కు సంబంధించిన సున్నత్‌లు

١١١٩ - عَنْ عَلِيِّ بنِ أبي طَالِبٍ رضيَ اللهُ عَنْهُ قالَ: كانَ النَّبيُّ ﷺ يُصَلِّي قَبْلَ العَصْرِ أَرْبَعَ رَكَعَاتٍ، يَفْصِلُ بَيْنَهُنَّ بِالتَّسْلِيمِ عَلى المَلائِكَةِ المُقَرَّبِينَ، وَمَنْ تَبِعَهُمْ مِنَ المُسْلِمِينَ وَالمُؤْمِنِينَ. رواه الترمذي وَقَالَ: حديثٌ حَسَنٌ.

1119. హజ్రత్ అలీ బిన్ అబూతాలిబ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) అస్ర్ నమాజుకు ముందు నాలుగు రకాతులు చేసేవారు. సన్నిహితంగా ఉండే దైవదూతలు, వారిని అనుసరించే ముస్లింలు, విశ్వాసులకు సలాం చేసి వాటిని వేరుపరిచేవారు.

*(తిర్మిజీ-హసన్)*

*(సుననె తిర్మిజీలోని నమాజ్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

వాటిని సలాంతో వేరుపరచేవారంటే రెండేసి రకాతుల చొప్పున నాలుగు రకాతులు చేసేవారని భావం. దైవదూతల మాదిరిగా విశ్వాసులు కూడా దేవుని ఏకత్వాన్ని, ఆయన గొప్పదనాన్ని విశ్వసిస్తారు కనుక వారిని దైవదూతల్ని అనుసరించేవారని చెప్పబడింది.

١١٢٠ - وَعَنِ ابنِ عُمَرَ رَضِيَ اللهُ عَنْهُمَا عَنِ النَّبِيِّ ﷺ قالَ: «رَحِمَ اللهُ امْرَأً صلَّى قَبْلَ العَصْرِ أَرْبعاً». رَوَاهُ أَبو داود، والترمذي وقالَ: حديثٌ حَسَنٌ.

1120. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) "అస్ర్‌కు ముందు నాలుగు రకాతులు చేసేవారిని దేవుడు కరుణించు గాక!"అని దీవించారు. *(అబూదావూద్, తిర్మిజీ- హసన్)*

*(సుననె అబూదావూద్‌లోని నమాజ్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

ఇంతకు ముందు హదీసులో వివరించబడిన దైవప్రవక్త ఆచరణకు అనుగుణంగా ఆ నాలుగు రకాతులను రెండేసి రకాతుల చొప్పున చేయవచ్చు. వీలైతే నాలుగు రకాతుల్ని

ఒకే సలాంతో కూడా నెరవేర్చవచ్చు. రెండు పద్ధతులూ సరైనవే. అయినప్పటికీ కొంతమంది తొలిపద్ధతి ప్రకారం చేయటమే ఉత్తమమని భావిస్తున్నారు. అస్ర్‌కు ముందు చేసే సున్నత్ నమాజును పండితులు 'గైర్ ముఅక్కదా'గా పేర్కొన్నారు. ఏది ఏమైనా ఆ నమాజు చేసినవారిని దైవప్రవక్త ఆశీర్వదించటం దాని ప్రాముఖ్యతను తెలియజేస్తోంది.

١١٢١ - وعنْ عليِّ بنِ أَبي طالبٍ رَضِيَ اللهُ عَنْهُ، أَنَّ النَّبيَّ ﷺ كانَ يُصلِّي قَبْلَ العَصْرِ رَكْعَتَيْنِ. رَوَاهُ أَبو داود بإِسنادٍ صحيحٍ.

1121. హజ్రత్ అలీ బిన్ అబూ తాలిబ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) అస్ర్‌కు ముందు రెండు రకాతులు చేసేవారు.

*(అబూదావూద్, ఆధారాలు దృఢమైనవి)*

*(సుననె అబూదావూద్‌లోని నమాజ్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

దీని ద్వారా అస్ర్‌కు ముందు సున్నత్ నమాజు రెండు రకాతులు కూడా చేయవచ్చని బోధపడుతోంది. కాని షేఖ్ అల్‌బానీ గారు ఈ హదీసులోని 'రెండు రకాతులు' అనే పదం అరుదైనదనీ (షాజ్ అనీ), ఇది నాలుగు రకాతుల ప్రస్తావన ఉన్న విశ్వసనీయమైన హదీసులతో విభేదిస్తోందని అంటున్నారు. కనుక అస్ర్‌కు ముందు సున్నత్ నాలుగు రకాతులు చేయటం ఎందుకైనా మంచిది.